# తప్పుమీదే!



నేను అబలను. నాలో తప్పేమీ లేదు. మీరు నాకు దూరమయ్యారంటే అది మీవల్లనే. దానికి బాధ్యురాల్ని నేను కాదు. మీరే!

తల్లిదండ్రులంటే నాకు వినయవిధేయతలు. వారెంత చెబితే అంత. వారు నన్ను మీకిచ్చి వివాహం చేశారు. నేను ఎనలేని సంతోషంతో మిమ్మల్ని పెళ్ళాడాను.

భర్తే దైవమని భావించాను. మిమ్మల్ని మనసారా ఆరాధించాను.

పరిమళపూరమైన ప్రేమపుష్పాల్ని మీ పాదాల ముందు గుమ్మరించాను. కాని ఆ సురభిళపుష్పాల్ని మీ కఠిన పాదాలతో మట్టగించారు; నా హృదయం మీదనుండి మీరు నిర్దయగా నడిచి వెళ్ళారు.

అయినా పతిభక్తిపరాయణురాలనైన నేను ఆ విషయం మనస్సులో పెట్టుకోలేదు. నేను యథావిధిగా మిమ్మల్ని ప్రేమిస్తూనే వచ్చాను.

నేను అందంగా లేనన్నారు. . . నన్ను చూస్తేనే అసహ్యం అన్నారు. . . నాకు చదువుసంధ్యలు లేవన్నారు. . . సంగీత సాహిత్యాలు లేవన్నారు. . . తల దువ్వుకోటం రాదన్నారు. . . చీర నాజూకుగా కట్టుకోవటం రాదన్నారు. . . ముక్కుపుడక పెట్టుకొని మోటుగా ఉన్నానన్నారు. . . పక్కపాపిడితో పాత పద్ధతిలో ఉన్నానన్నారు.

చీటికి మాటికి చిరాకు పడేవారు. . . కసిరికొట్టేవారు. . . దగ్గిరికి చేరనిచ్చేవారు కాదు . . . అకారణంగా దూషించేవారు; దండించేవారు.

నే నన్నీ భరిస్తూనే వచ్చాను. నే నెప్పుడూ మీకు ఎదురు చెప్పలేదు. ఎందుకంటే భర్తే దైవమనే నీతి ఉగ్గుపాలతో రంగరించి పోసింది నా తల్లి.

మీరు వేలెత్తి చూపే లోపాలన్నీ నాలో ఉండవచ్చు. లేవని నే ననను. కాని మీకు నచ్చిన పిల్లనే మీరు ఎన్నుకుని వివాహం చేసుకొని ఉండవలసింది!

మీ తల్లిదండ్రులకు ఎదురు చెప్పలేక నన్ను చేసుకున్నానన్నారు. అయితే నాకు విడాకు లిచ్చినప్పుడు మీ తల్లిదండ్రులకు చెప్పే ఇచ్చారా? మన విడాకులకు నేను బాధ్యురాలినా?

మిమ్మల్నే దైవంగా పరిగణించే నేను మీరు విడాకుల ప్రస్తావన తేగానే, హృదయాంతరాళంలో ఎంత కుమిలిపోయానో మీకు తెలుసా? ఏకధారగా కన్నీరు కారుస్తూ ఎన్ని రాత్రులు గడిపానో మీకు తెలుసా?

విడాకులు ఇవ్వవద్దని, ఎప్పుడూ మీతోనే కాపురం చేసే భాగ్యం నాకు కలిగించమని కాళ్ళావేళ్ళాపడి ప్రార్థించాను.

మీ పాదాలనంటి నమస్కరించి బ్రతిమాలుతూంటే నా శిరస్సును దూకుడుగా తోసిపారేశారు, నేను నేలపైకి ఒరిగిపోయినా తిరిగి లేచి మీ కాళ్ళు పట్టుకుని "నన్ను వదలకండి", "నన్ను తృణీకరించకండి!" అని వాపోతూంటే నా చేతులనుండి తప్పించుకొని / విసురు విసురుగా వెళ్ళిపోయారు.

అన్నంతపనీ చేశారు. లేనిపోని కారణాలేవేవో కల్పించి విడాకు లిచ్చివేశారు. నా జీవితం ఎండిన మోడులా గయింది. విలపించి, విలపించి నా మనసు కరుడు గట్టుకొని పోయింది. నే నెలాగో మనస్సు రాయి చేసుకున్నాను. కాని నా తల్లిదండ్రులు నా నిర్భాగ్యజీవితాన్ని తలుచు

ఒక వస్తువుకు అయినా, మనిషికి అయినా స్వతః కొంత విలువ ఉంటుంది. దానిని పొందటం అయినా, పెంపొందించటమే అయినా ఇతరులమీద ఆధారపడుతుంది. ఉన్న విలువ ఎందుకు కొరగాకుండా పోవడానికి కూడా ఇతరులే బాధ్యులు. ఇది మనిషి విషయంలో మరీ స్పష్టం. ప్రపంచం పుట్టి ఇంతకాలం అయినా మనిషి ఎదుగకుండా పోవడానికి ఇదే కారణమేమో ?

కొని ఏడ్చేవారు. వాళ్ళ కన్నీరు కాలవలు కట్టింది. నాకు జరిగిన అన్యాయంకన్న, దుఃఖసాగరంలో అల్లాడిపోతున్న నా తల్లిదండ్రులను గురించి నా హృదయం ఆక్రోశించింది.

నన్ను పునర్వివాహం చేసుకోమని నా తండ్రి మరి మరీ కోరారు. నేను ఒప్పుకోలేదు.

నేను అవివాహితనూ కాదు, విధవనూ కాదు. నా దుర్భరపరిస్థితి వారు సహించలేకపోయారు. నాకు ఎలాగైనా వివాహం చేసితీరాలని పట్టుబట్టారు. ఆఖరికి దుఃఖభరితులైన నా తల్లిదండ్రుల ఆవేదన తీర్చటానికే నిశ్చయించుకున్నాను. మీరు వారి హృదయంలో నాటిన కంటకాన్ని పెకలించి వారికి ఉపశాంతి కలిగించాలనుకున్నాను.

అందుకే నేను తిరిగి వివాహం చేసుకొన్నాను. మావారంటే నాకు పంచప్రాణాలూను. వారి పాదసేవ చేసుకొనటమే నా ఆశయం.

వారెంతో అందంగా ఉంటారు మీకన్నా! పసిమి పచ్చని చాయతో, పొడుగుకు తగిన లావుతో, బలిష్ఠంగా, ఆరోగ్యంగా, చలాకీగా ఉంటారు. కాని నన్నంతగా చేరదీసేవారు కాదు ప్రథమంలో. నా వైవాహిక జీవిత నూతనాధ్యాయం ఎలా ముగుస్తుందోనని గుండె తటతట కొట్టుకొనేది.

ఒకరోజు అద్దం ముందు పెట్టుకొని, శిరోజాలకు నూనె రాసుకొని తల దువ్వుకుంటున్నాను.

నా గది ముందునుండి ఎక్కడికో వెళుతున్న మావారు తటాలున ఆగి, నా చేరువకు వచ్చి "అనూరాధా! నీ ముఖంతీరుకు పక్కపాపిడి ఏం బాగుండదు. మధ్యపాపిడి తీస్తే ముఖానికి నిండుతనం వస్తుంది . . . ఇలా" అంటూ నా చేతిలోని దువ్వెన లాక్కొని మధ్యపాపిడి తియ్యబోయారు. నాకు సిగ్గు వేసింది. తన్మయత్వంతో "మీ సలహాప్రకారం ఇకనుండి మధ్యపాపిడే తీసుకుంటాను" అని వారి చేతిలోని దువ్వెన లాక్కున్నాను.

అంతటితో వారు ఊరుకోలేదు. "అనూ, సౌందర్యపోషణలో అశ్రద్ధ చేస్తావేం?. . . ఆ ముక్కుపుడక చూడు నీ ముఖాన్నెంత వికృతపరుస్తూ ఉందో!. . . అది తీసివెయ్. . ." అన్నారు.

నాకు నవ్వు వచ్చింది. నవ్వు క్షణం ఆపుకొని ముక్కుపుడక తీసివేశాను. నవ్వు ఇక ఆపుకోలేక పక్కున నవ్వేశాను. నా నవ్వు చూసి వారికీ నవ్వు వచ్చింది. పకపక నవ్వారు. ఇరువురం నవ్వుకున్నాం. నా కాపరంలో! నవ్వులపువ్వులు విరిశాయి.

మీతో కాపరం చేసినప్పుడు ఒక్క నవ్వు నవ్వి ఎరగను. మీ ముఖంలో ఏనాడూ కనీసం చిరునవ్వయినా చూడటం నోచుకోలేదు.

మావారు నాకోసం ముచ్చటైన టాయ్‌లెట్ సెట్ తెచ్చారు. నిలువుటద్దంకూడా ఒకటి తెచ్చి నా గదిలో అమిర్చారు. కొత్తకొత్త డిజైనులలో చీరలూ, జాకెట్లూ తెచ్చిపెడతారు. వారి కంటికి నచ్చినట్లుగా నన్ను తీర్చిదిద్దుకొంటారు. సిగ్గు దొంతరలు దొంతరలుగా నన్ను ఆవరిస్తుంది. నా మనసు పరవశిస్తుంది.

ఏ కాలంలో వచ్చే పువ్వులు ఆ కాలంలో నాకు తెస్తారు. గుత్తులు గుత్తులుగా నా సిగలో అలంకరించుకుంటూ ఉంటే పూల ఘుమఘుమలకు నా దగ్గిరికి వచ్చి తృప్తిగా ఊపిరిపీల్చుకొంటారు. వారి సాన్నిధ్యంలో నా ఎదను ఏదో లాహిరి ఆవరించినట్లుంటుంది.

మావారు నాకు స్వయంగా చదువు నేర్పారు. నేనిప్పుడు అనర్గళంగా చదవగలను; ధారాళంగా వ్రాయగలను.

మావారికి సంగీతమంటే మహా ప్రీతి! కాని నాకు సంగీతం రాదుకదా? అయినా వారు నిరుత్సాహపడలేదు. మీలా నన్ను నిందించలేదు. సంగీతం మాస్టర్ని పెట్టి వీణ నేర్పించారు. నే నెంత అదృష్టవంతురాల్ని!

ఇప్పుడు నేను నేనుకాదు. మావారు తీర్చిదిద్దుకున్న పుత్తడిబొమ్మను!

మావారు ప్రేమామృతాన్ని వెదజల్లి ఎండి మోడైన నా జీవితాన్ని చిగురింపజేశారు.

కొన్ని రోజులనుండి మీరు నీడలా నన్ను వెంబడించటం గమనిస్తూనే ఉన్నాను.

ఒకసారి సాహిత్యసభలకు మావారూ, నేనూ వెళ్ళినపుడు మా వెనక వరసలోనే మీరు కూర్చున్నారు. నేను గమనించకపోలేదు.

మరొక పర్యాయం బీచ్‌లో శ్రీవారూ, నేనూ షికారు చేస్తున్నప్పుడు మాకు కొంత దూరంలో మీరు తచ్చాడటం నేను చూడకపోలేదు.

కళామందిరంలో ఏర్పాటు చెయ్యబడ్డ నా సంగీత కచ్చేరీకి వచ్చి నావంక కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నారు కదూ?

రోజూ మా ఇంటిచుట్టూ ప్రదక్షిణాలు చెయ్యటంకూడా కనిపెట్టాను.

ఈ రోజు మావారు ఊళ్ళో లేరని చొరవచేసి మా ఇంట్లోకి జొరబడ్డారు.

మీరు ఏ నోటితో నన్ను అసహ్యించుకున్నారో ఆ నోటితోనే పొగుడుతున్నారు. నాలో ఇంత అందం, ఇంత ప్రతిభ దాగిఉన్నాయని కలలోనైనా అనుకోలేదన్నారు. దానికి నన్నేం చెయ్యమంటారు?.

వీణను అవిద్వాంసుని చేతికి ఇచ్చినపుడు దానిని ఒక మూల పెట్టి ఉంచుతాడు. మధుర మంజుల గానసుధా లహరుల నాలపించగల వీణ అతని చేతిలో మూగపోయి ఉంటుంది. ఒకవేళ తంత్రులను మీటబోయినా వికృతశబ్దాలు ప్రసరిస్తాయి. ఆ వీణే ఒక విద్వాంసుని చేతిలో పెడితే ఆ వీణాతంత్రులను తన సిద్ధాంగుళులతో మీటి హృదయాహ్లాదకరమైన సంగీతం ఆలాపించి తనువులు పులకింపచేస్తాడు.

అవిద్వాంసుని చేతిలోనూ అదే వీణ; విద్వాంసుని చేతిలోనూ అదే వీణ. ఆ వీణలో మార్పేమీ లేదు కాని ఆ వీణలో అణిగిఉన్న మనోహరనాదం దాన్ని ఉపయోగించే వారి చేతిలోనే కదా బహిర్గతమవుతుంది!

నేనూ ఒక వీణవంటిదాననే.

మావారికి విడాకులిచ్చి మిమ్మల్ని తిరిగి వివాహం చేసుకోమంటున్నారు! వివాహబంధాన్ని ఎంత చులకనగా పరిగణిస్తున్నారు!

ఆంధ్రవనితలో విడాకులు స్వైరవిహారం చెయ్యటానికి వీలులేదు. ఆంధ్రవనిత పతివ్రత. ఆమె పూర్వుల పవిత్ర సంప్రదాయానుగుణంగా మారుతున్న నవసమాజపు పోకడలను సమన్వయ పరుచుకొంటూ జీవితాన్ని మలుచుకొంటుందని గ్రహించండి.

మీరు విడాకులు ఇచ్చినా ఇంతవరకూ అవివాహితుడుగానే ఉండిపోయానన్నారు. ఆ విషయం ఇప్పుడు నాకు అనవసరం, నాలో తప్పేమీ లేదు. మీరు నాకు దూరమయ్యారంటే అది మీవల్లనే. దానికి బాధ్యురాల్ని నేను కాదు. . . మీరే.

ఇక వెళ్ళండి. మరెప్పుడూ నా ఇంటి చాయలకు కూడా రావద్దు!

నమస్కారం. ★

**ఎమ్. దయానంద రుక్మిణి**



గంగాస్నానానంతరం — ఫోటో—ఎమ్. ఆర్. వెంకటరామన్ (మద్రాసు-4)